క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



కొడవలూరు: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరిలో అప్రమత్తత అవసరమని సైబర్ క్రైమ్ ఎస్సై కరేటి ప్రదీప్ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేసుకోమని వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో సందర్శించరాదన్నారు. ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న అనేక వెబ్‌సైట్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాస్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, ఏపీఓ వై.ఫణికుమార్, ఏఓ కె.గిరీష్‌కుమార్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ సతీష్, పీడీలు కె.బాలు, బి.సుప్రియ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం మజరా ఎన్టీఆర్ గిరిజన కాలనీలో రూ.11 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పనులను స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో యల్లాయపాళెం పంచాయతీలో రూ.1.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. స్థానిక నాయకులు కె.వెంకటరమణారెడ్డి, జి.రాజేంద్ర, వంశీరెడ్డి, బి.విజయకుమార్, బి.శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

ఇందుకూరుపేట: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత తప్పనిసరి అని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు అన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో చెత్త సేకరణపై ఇంటింటి సర్వే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తడి, పొడి చెత్తను ప్రజలు వేర్వేరుగా ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మెంటల్ హెల్త్ అవేర్‌నెస్‌పై సెమినార్ నేడు

నెల్లూరు(టౌన్): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా – నెల్లూరు ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాల్‌లో మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ సెమినార్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ అడిక్షన్ రెమిడీస్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సూసైడ్స్ రెమిడీస్, ఇంపార్టెన్స్ ఆఫ్ మెంటల్ హెల్త్ తదితర వాటిపై ప్రముఖ వక్తలు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 6.30 గంటలకు గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మానసిక ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

వంద శాతం పంపిణీకి చర్యలు

నెల్లూరు(పొగతోట): స్మార్ట్ రేషన్‌కార్డులను వంద శాతం అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్‌ఓ అంకయ్య మండలాధికారులను ఆదేశించారు. ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయం నుంచి గురువారం మండలాధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 7.10 లక్షల స్మార్ట్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆరు లక్షలకుపైగా కార్డులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. మిగిలిన కార్డులు త్వరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరం, రూరల్‌కు సంబంధించి 35 వేల కార్డులకు అధికంగా పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చినుకు జాడ లేక..

- వర్షాకాలం కాస్త ఎండా కాలమై..
- ఉరుములు, మెరుపులతో సరి
- ఆందోళనలో తీరప్రాంత వాసులు



నీరు లేక వెలవెలబోతున్న కోడూరు చెరువు

తోటపల్లిగూడూరు: తీర ప్రాంత మండలమైన తోటపల్లిగూడూరు ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కరువు కోరల్లో చిక్కుకుంది. ప్రతి సంవత్సరం ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మండలంలో 30 మిల్లీలీటర్ల మేర సాధారణ వర్షపాతం నమోదవుతుంది. అయితే ఈసారి ప్రస్తుతానికి 5 మి.మీ మేర వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించి నెలలు గడుస్తోంది. కానీ మండలంలో వానలు జోరందుకోలేదు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో మోస్తరు చిరుజల్లులు కురిశాయి. గడిచిన రెండు రోజులు మినహా పదిహేను రోజులుగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వెలవెలబోతూ..

వర్షాలు లేకపోవడంతో మండలంలోని పలు చెరువులు, గుంతల్లో చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ పరిస్థితిలో ముంచుకొస్తున్న రబీ సాగు సీజన్‌ను ఎలా మొదలుపెట్టాలో రైతులకు అర్థం కావడం లేదు. నారుమళ్లు సిద్ధం చేసుకోవాల్సిన ఈ సమయంలో వానలు పడకపోతే సాగు ఆలస్యమై దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా పచ్చిగడ్డితో కళకళలాడాల్సిన పంట పొలాలు బీడుగా మారడంతో పచ్చిమేత కరువై పశువులు, మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. తీర ప్రాంతంలోని బోరుబావుల్లో సైతం సాగు నీరు అడుగంటిపోవడంతో అటు తాగునీటికి ఇటు సాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. వర్షాలు ఇంకా ఆలస్యమైతే తీర ప్రాంత మండల వాసులు మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కోక తప్పదు.

గతంలో ఎన్నడూ చూడలేదు



ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఈ సమయానికి మోస్తరు వానలతో చెరువుల్లో సాగు నీరు చేరేది. ప్రస్తుతం నారుమళ్లను సిద్ధం చేసుకోవాల్సిన సమయం వచ్చింది. అయితే ఎక్కడా నీరు లేకపోవడంతో సాగుకు దూరమయ్యే పరిస్థితి ఎదురవుతోంది.

– కోటా శేఖర్‌రెడ్డి, రైతు, వరిగొండ పంచాయతీ



చినుకు జాడలేకపోవడంతో పొలమిలా..



మేత కోసం తిరుగుతున్న మూగజీవాలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ కన్నయ్య



ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఏడీఏ

పొదలకూరు: వ్యవసాయ సీజన్‌లో ఎరువులు, పురుగు మందుల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు భూసార పరీక్షల కేంద్రం ఏడీఏ కె.కన్నయ్య పేర్కొన్నారు. పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పొదలకూరు పట్టణంలో ఎరువులు, పురుగు మందుల గోదాములను గురువారం ఏడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు, రికార్డుల నిర్వహణ పరిశీలించారు. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన విత్తనాలు, ఎరవులను పరీక్షల నిమిత్తం అగ్రి ల్యాబ్‌కు శాంపిల్స్‌ను పంపాల్సిందిగా సూచించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాల ట్యాగ్‌లను పంట కాలం పూర్తయ్యేంత వరకు తమ వద్ద ఉంచుకోవాల్సిందిగా సూచించారు. తనిఖీల్లో ఏఓ వి.ప్రతాప్, ఏఈఓ బి.రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీడీ శోభారాణి

పొదలకూరు: వసతి గృహ సంక్షేమాధికారులు విద్యార్థుల ఆరోగ్యపై శ్రద్ధ వహించాలని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి అన్నారు. పొదలకూరులో గురువారం ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని సంక్షేమాధికారులతో డీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టళ్ల చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను చేయించాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహారం అందజేయాలన్నారు. సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీరామ్

పొదలకూరు: జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయడంతో పాటు అక్రిడిటేషన్లను తక్షణమే అందజేయాలని ఏపీ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ డిమాండ్ చేశారు. పొదలకూరులో గురువారం మాట్లాడుతూ ప్రజల సంక్షేమ కోసం అనేక రకాల జీఓలను విడుదల చేసే ప్రభుత్వాలు అక్రిడిటేషన్ కోసం ఎందుకు జీఓ ఇవ్వడం లేదో వెల్లడించాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు అభద్రతాభావానికి గురిఅవుతున్నారని, వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిందిగా కోరారు. హెల్త్ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్, ఉపాధ్యక్షుడు కె.హజరత్, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్, సభ్యుడు కె.సుధాకర్‌రెడ్డి, స్థానిక మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం



వెంకటాచలం: మండలంలోని కంటేపల్లి గ్రామంలో మండవ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఫౌండేషన్ వైద్యుడు శ్రీనివాసులునాయుడు, వెంకటాచలం పశువైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ డి.సృజన గర్భకోశ వ్యాధులకు గురైన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే దూడలకు నట్టల నివారణ మందులు తాగించి, రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం వైద్య సహాయకులు ఎం.రాజు, టి.శ్రావణ్‌కుమార్, సుధీర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాటూరు జెడ్పీ హైస్కూల్లో సదస్సు



కోవూరు: మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎ.మధు పాల్గొని మాట్లాడుతూ శరీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనే మానసిక శిక్షణ ఇవ్వడం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ జుల్ఫికర్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబా మందిరాల్లో విశేష పూజలు



మనుబోలు : ప్రత్యేకాలంకరణలో సాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి పల్లకి సేవ జరిగింది.

⇨ మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు, మనుబోలు గ్రామాల్లో ఉన్న సాయిబాబా మందిరాల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు లక్ష్మీనారాయణ, శశికుమార్ శర్మ బాబా విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మనుబోలులో కార్యక్రమాలకు పిడూరు గ్రామానికి చెందిన అన్నంరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, హరిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు ధర్నా

- ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు(అర్బన్): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.4 కోట్ల నిధులతో 2009లో బుజబుజనెల్లూరులో ఏర్పాటు చేసిన దేశంలోనే రెండో అతిపెద్ద వాటర్ ప్లాంట్ ప్రస్తుతం వినియోగంలో లేదని, దీనిని పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.పెంచలనరసయ్య, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ కార్యకర్తలు గురువారం ధర్నా చేశారు. ప్లాంట్‌ను పునరుద్ధరించాలని, కార్పొరేషన్ తీరును నిరసిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుజబుజనెల్లూరు ఉత్తమ పంచాయతీగా ఉన్న కాలంలో ఇక్కడ ఫ్లోరైడ్ నీరు ఉండేదన్నారు. అలాంటి తరుణంలో హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, భారత ప్రభుత్వ సెక్రటరీ రామస్వామి చేతుల మీదుగా 20 వేల మంది దాహార్తిని తీర్చడానికి ఇక్కడ మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారన్నారు. అయితే కాలక్రమంలో పంచాయతీని నగరపాలక సంస్థలో విలీనం చేశాక ఈ ప్లాంటును మూసేశారన్నారు. ఇక్కడి స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఖరీదైన జనరేటర్లను కూడా అధికారులు ప్రజలకు చెప్పకుండా దొంగతనంగా ఎక్కడికో తరలించారన్నారు. ఇక్కడ కార్మికులు, బేల్దారి కూలీలే ఎక్కువ మంది ఉన్నారన్నారు. వారు నెలకు రూ.1,000కి పైగా ఖర్చు చేసి వాటర్ క్యాన్లను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కమిషనర్, కలెక్టర్‌కు పలు దఫాలుగా అర్జీలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో ఆందోళన చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, నాగేశ్వరరెడ్డి, మాలకొండయ్య, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, తిరుపాలు, వెంకయ్య, ఓబులరెడ్డి, శ్రీనివాసులు, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీస్ కేస్ ఉంటే మాకేంటి

- జొన్నవాడ ఆలయ కమిటీలో అనర్హుడికి చోటు
- టీడీపీ నేత కావడంతో నిబంధనలు అతిక్రమించి నియామకం



జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో రూ.5 కోట్ల భూమి ఆక్రమణ విషయం మరువకముందే.. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఆలయ కమిటీలో ఓ అనర్హుడికి చోటు కల్పించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. స్థానికుల కథనం మేరకు.. ఇటీవల కామాక్షితాయి ఆలయానికి సంబంధించి 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇందులో జొన్నవాడ గ్రామానికి చెందిన ముంగర సుధాకర్ అనే వ్యక్తిపై బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో 2023లో స్థానిక వరదరాజస్వామి ఆలయంలో జరుగుతున్న ఓ కార్యక్రమంలో ఈఓను దూషించాడనే విషయమై కేసు నమోదై ఉంది. ఇవేవీ పట్టించుకోకుండా సదరు వ్యక్తికి ఆలయ కమిటీలో చోటు కల్పించడంపై భక్తులు మండిపడుతున్నారు. ఈనెల 11న ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం జరుగనుంది. కాగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందా.. లేక వాయిదా వేస్తారా? అనేది చూడాలి.

నిబంధనలు పట్టవా?

దేవదాయ, ధర్మదాయ శాఖ చట్టం ప్రకారం ఏ ఆలయంలోనైనా ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియమించాలంటే ఆ శాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఎలాంటి కేసులు ఉన్నా సభ్యులుగా అర్హత కోల్పోతారు. సనాతన ధర్మంపై అవగాహన, హిందూ ధర్మాన్ని పాటించడం లాంటి నిబంధనలు చట్టంలో ఉన్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన కామాక్షితాయి ఆలయ కమిటీలో అనర్హుడికి చోటు కల్పించడంపై స్థానికులు, భక్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కేవలం టీడీపీ కార్యకర్త అయితే సరిపోతుందా?, ఎలాంటి అర్హతలు అవసరం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జొన్నవాడలోని టీడీపీకి చెందిన ఓ వర్గం నాయకులు, కార్యకర్తలు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎమ్మెల్యేకి తెలిసే జరిగిందా?

ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించిన వారంతా టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారే. కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టినప్పటి నుంచి అనధికారికంగా ఆలయంలో కూటమి నేతలు చక్రం తిప్పుతున్నారు. అమ్మవారి భక్తురాలిగా నిత్యం ప్రచారం చేసుకునే కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ట్రస్ట్‌బోర్డు మెంబర్లను సిఫార్సు చేయడంలో కనీస విచారణ చేయలేదని తెలుస్తోంది. ఒకవేళ తెలిసినా ఏం కాదులే.. ప్రభుత్వం తమదే కదా అన్న నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించాం

ఆలయ ధర్మకర్తల మండలి నియామకంలో నిబంధనలు పాటించాం. ఆలయ సభ్యుడిగా నియామకమైన సుధాకర్‌పై కేసు ఉన్న విషయం మాకు తెలియదు. గతంలో ధర్మకర్తల మండలి నియామక సమయంలో సభ్యులపై కేసులు ఉన్నాయా?, లేదా? అనే విషయం స్థానిక పోలీసు స్టేషన్‌లో విచారణ జరిపేవారు. ప్రస్తుతం అభ్యర్థి నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ స్వీకరించి నియామకం చేయడం జరుగుతోంది. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.

– ఈఓ, అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ఎంఈఓ సునీల్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విజయాలను సాధిస్తూ అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.అరోరా, ముజీర్, బి.వెంకటకృష్ణ, ఎస్.ప్రసాద్, సీహెచ్ సుందర్‌బాబు, లక్ష్మయ్య, జ్యోతి, రమేష్, పల్లవి, రేణుక, నాగరాజు పోటీలను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కురిచెర్లపాడు సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పొదలకూరుకు చెందిన రమాకాంత్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి పొదలకూరుకు వెళుతుండగా కురిచెర్లపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గాయపడిన రమాకాంత్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు



పొదలకూరు : విరువూరులో..



మనుబోలు : కట్టువపల్లిలో..

పొదలకూరు: మండలంలోని విరువూరు ప్రగతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను గురువారం సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, మాధురి, శీనమ్మ, గాయత్రి, అమరావతి, ఆశా వర్కర్ పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

మనుబోలు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని కట్టువపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కోడిగుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారి ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీతాలక్ష్మి, అంగన్‌వాడీలు రాధ, ఉమామహేశ్వరి, కల్పన, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై సీహెచ్‌సీలో అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

పొదలకూరు: స్థానిక సీహెచ్‌సీలో జీఎస్టీపై వైద్యాధికారులు, అసిస్టెంట్ కమిషనర్ (జీఎస్టీ) గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీ ప్రమీల మాట్లాడుతూ మందులపై జీఎస్టీ తగ్గుతుందన్నారు. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడే రోగులకు ఉపయోగం ఉంటుందన్నారు. ప్రతి మందుల షాపుల వద్ద తగ్గిన జీఎస్టీ వివరాలను ప్రకటించమని ఆదేశించడం జరిగిందన్నారు. సదస్సులో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్, వైద్యాధికారులు పాల్గొన్నారు.